'ఏం చేయను చెప్పండి! తీరా 'మణి'కేమో, ఈ వూళ్లో, జాబ్ వచ్చిందాయె! అంచేత, నేనూ ఈ వూరే వద్దామనుకున్నాను. ఈ వూరేమో, మా ఇద్దరి వూళ్లకీకూడా, బాగా దగ్గిరగావుంది. అయిదేసి అణాల బస్సుఛార్జీలతో ఇళ్లకి పోయి రావొచ్చును. నాకూ తల్లితండ్రి అన్నలూ, చెల్లెళ్లూ అందరూ వున్నారు. అంచేత నానాగడ్డికరిచి, చచ్చి, చెడీ, ఈ వూరులో ఈ మేష్టరు గిరీ కుదుర్చుకున్నాను,' అన్నాడు అతను. చీకటిపడింది. రోడ్డు దీపాలు వెలిగాయి!

'బాతాఖానీ వేసుకు కూర్చున్నారా? పదండి భోజనాలకి!' అంటూ మణి వచ్చింది లోపల్నించి.

'ఇంతకీ అసలు విషయం చెప్పేరు కాదు! మణి గారు విరాకేమి అవుతారన్నారు?' అన్నాడు జనార్దనం.

'భలేవారే! రామాయణం అంతావిని సీత రాముడు కేమవుతుంది? అన్నారుట అల్లావుంది!

'మణికోసం కాకపోతే నేనీ వూళ్లో వుద్యోగం కోసం పరుగులెత్తటం ఎందుకూ విూ పిచ్చిగానీ!' భళ్లుమని నవ్వాడు అతను.

'అంటే?' అన్నాడు రాజా అర్థంకానట్లు. అర్థం చేసుకుందుకు ఇష్టంకానట్లు వుంది, రాజా ధోరణి.

'అంటేనా! మణి, నా భార్యండీ! నాభార్య! అహహ! భలే బ్రహ్మచారులే దొరికారు! పదండి భోజనాలకి'! అని మళ్లీ పెద్దగా నవ్వాడు అతను. మణికూడా నవ్వింది నిండు చామంతిలా!

జనార్దనం తెల్లబోయి రాజు ముఖంకేసి చూసాడు. రాజుకళ్లు నిండుకుండలయిపోగా గబగబా, లోపలికివెళ్లి 'బాత్‌రూం'లోనికి పోయి తలుపు వేసుకున్నాడు!

---

